రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(దౌల్తాబాద్): రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. దౌల్తాబాద్ మండల పరిధి లోని ఇందుప్రియాల్‌ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ స్టోర్,ల్యాబ్,ఇంజక్షన్ గదులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో టమాటా పప్పు, హైస్కూల్ పప్పుతోపాటు అలుగడ్డ టమాటా సరిడినంత వండ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు సరిపడినంత కూరగాయలు అందించాలని విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికలకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 81253 52721 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులతో సహా 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి పరిశీలించి, ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

విద్యార్థులకు రుచికరమైన

భోజనాన్ని అందించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్

గజ్వేల్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం జిల్లాకలెక్టర్ కె.హైమావతి అకస్మికం గా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా విద్యాలయంలో వండిన అన్నం, పాలకూర పప్పు, వంకాయ ఆలుగడ్డ టమాట కూరలను పరిశీలించి పిల్లలకు భోజనంలో నెయ్యి కూడా వండించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సరుకులు ఇవ్వగానే రాయాలని ఒకేసారి రాస్తామని నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరు ప్రకారం అందరికి ఆహారం సరిపోయే విధంగా రుచికరంగా వండాలని, పిల్లలకు మరల అన్నంకూరలు వారు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆహారం బాగా నమిలి తినా లని, తినేటప్పుడు మాట్లాడవద్దని, ఒక్క మెతుకు పడేయకూడదని, ఆహారం సరిపోయేంత తింటేనే శారీరకంగా దృఢంగా ఉంటారని తెలి పారు. ప్రతిరోజు చదువుతోపాటు ఆటలు సైతం ఆడాలని అన్నారు. పిల్లలకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడవద్దని, మంచి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు.

సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి

-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్

ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ధన్‌రాజ్

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): పట్టణంలోని జిల్లా ప్రభుత్వా సు =పత్రిని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్ రాజ్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ అన్నపూర్ణతో సమావేశమై మాట్లాడారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలిపారు. తొమ్మిది నెలల గర్భవతులకు ఎక్సైజ్ కొరకు ఒక యోగా టీచర్ కావాలని, వారికి కాలక్షేపం కోసం ఒక టీవీని ఏర్పాటు చేయాలని, అందుకు తగిన ప్రణా ళికలు కావాల్సిన సదుపాయాలను సమకూర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దీప్తిప్రియాంక, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాము, క్లస్టర్ సిహెచ్ఓ కె.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో నర్సరీ ఏర్పాటు

ఉప కులపతి డాక్టర్ రాజిరెడ్డి

రైతులకు మొక్కలను అందజేస్తున్న ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి

ములుగు, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ములుగులో సోమవారం యూనివర్సిటీ ఉద్యాన నర్సరీని నెలకొల్పబడిందని యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.రాజి రెడ్డి తెలిపారు. ఈ నర్సరీ ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులు లబ్ధిపొందుతారని అన్నారు. ఈ నర్సరీలో నాణ్యమైన తెగుళ్లు సోకని పండ్ల, పూల, కూరగాయల, వివిధ ఔషధ మరియు సుగంధ ద్రవ్య మొక్కలు వివిధ ధరలలో లభ్యమవుతాయని తెలిపారు. ఈ మొక్కలను యూనివర్సిటీలోని ఇతర పరిశోధన స్థానాల నుండి తెప్పించడం జరిగిం దని, ఇందువల్ల రైతులు ప్రైవేటు నర్సరీ నుండి కాకుండా యూనివర్సిటీ ఉద్యాన నర్సరీ నుండి నాణ్యమైన మొక్కలను తక్కువ ధరలో కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

రెండవరోజు 8 నామినేషన్లు ఉపసంహరణ

మాట్లాడుతున్న ఎన్నికల సహాయ అధికారి జగ్జీవన్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : నారాయణఖేడ్ మున్సిపాలిటీ రెండవరోజు ఎనిమిది నామినే షన్‌లు ఉపసంహరించుకోవడం జరిగిందని ఎన్నికల సహాయ అధికారి జె.జగ్జీవన్ తెలిపారు. సోమవారం ఎన్నికల సహాయ అధికారి జగ్జీవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి 7 మంది, బిఆర్ఎస్ నుంచి ఒకటి మొత్తం 8నామినేషన్లు ఉప సంహరించు కోవడం జరిగిందని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ చేయడం సిగ్గుచేటు

తప్పు చేయకుంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి... రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రజల, అధికారుల, రాజకీయ నాయకులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఫోన్‌లు ట్యాపింగ్ చేయడం అత్యంత నీచమైన నేరమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పోరాటం అంటేనే ఒక ఆత్మగౌరవ పోరాటమని, సకల జనులు కలిసి పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్‌లు ట్యాపింగ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై జరుగుతున్న విచారణలో బిఆర్ఎస్ నాయకులను సంబందిత శాఖల అధికారులు పిలిస్తే దానిని రాద్దాంతం చేస్తూ, హింసాత్మక నిరసనలకు పిలుపునిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విచారణకు ఇంతగా భయపడుతున్నారంటే, గతంలో అనేక మంది వ్యక్తుల జీవితాల్లో ఆర్థిక, వ్యాపార, రాజకీయ, ఉద్యోగ, కుటుంబ పరమైన రహస్యాల్లోకి తొంగిచూసి ఉంటారన్నారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఇందులో కక్ష సాధింపు గానీ, కుట్ర గానీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా తప్పు చేయలేదని భావిస్తే, విచారణలో తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని సూచించారు. డైవర్షన్ పాలిటిక్స్ పేరుతో కక్ష సాధింపు ధోరణి అంటూ రాజకీయ లబ్ధి పొందే ప్రచారాన్ని మానుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రవీణ్య

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధసమస్యలపై ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండుతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూసమస్యలు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర అంశాలతోపాటు పంచాయతీరాజ్ ఇంజ నీరింగ్, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, డిడబ్ల్యుఓ, డిసిఎస్ఓ, పశుసంవర్ధక, శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్‌కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణిలో 16 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్క రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ప్రజలు పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీజ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఇబ్రహీం నగర్ తెలంగాణ మోడల్‌స్కూల్‌లో టెన్త్ చదువుతున్న ఆకుల శ్రీజ తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సిద్దిపేట ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆకుల శ్రీజకు ప్రశంస పత్రం మెమోంటోను అందించి అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీజకు ప్రశంస పత్రం మెమోంటోను అందిస్తున్న దృశ్యం

మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోద రుడు గూడెం మధుసూదన్‌రెడ్డి మాజీ సీఎం, బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావుని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆదివారం సాయంత్రం సిట్ విచారణ అనంతరం హైదరాబాద్‌లోని నందినగర్‌లోగల కేసీఆర్ నివాసంలో కలిశారు. మున్సిపల్ ఎన్నికలలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ జెండా ఎగరవేసి క్లీన్ స్వీప్ సాధించాలని మాజీ సీఎం కేసీఆర్ సూచించారని మధు సూదన్‌రెడ్డి తెలిపారు. గత దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో పని చేసి బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించుకొని వస్తామని గూడెం మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రెండు పాఠశాలల్లో నోడల్ అధికారుల తనిఖీ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : జిల్లాస్థాయి తనిఖీ బృందం నోడల్ అధికారి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీమ్ సభ్యులు పి.జ్యోతి (డీఆర్పీ), సభ్య రాలు ఏ.కే.ఎం లక్ష్మి మండల పరిధిలోని చిట్కుల్, ప్రాథమిక పాఠశాల, చిట్కుల్ వడ్డెర కాలనీ లోనూ రెండు పాఠశాలల్లో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఇందులో భాగంగా ప్రశ్నాపత్రాలు ఎఫ్ఎల్ఎన్, సిసిఈ, పేరెంట్స్ మీటింగ్, మధ్యాహ్నం భోజన రికార్డులు, తరగతి ఉపాధ్యాయుల పరిశీలన, టిఎల్ఎం లకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మూడవ తరగతి ఎఫ్ఎల్ఎస్ పరీక్ష నిర్వహణ నిర్వహించాల్సిన రికార్డుల గురించి వివరించారు. పాఠశాల పరి సరాల ఆవరణ, టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయని సంతృప్తి చెందారు. చిట్కుల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సౌజన్య, రాహుల్, రామచంద్రయ్య, పాల్గొన్నారు. అలాగే చిట్కుల్ వడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాలలోనూ తనిఖీలు చేపట్టారు. ఇక్కడ ప్రభుత్వం నుండి సరఫరా చేసే ఉచిత మధ్యాహ్న భోజనం వివరాలు మాత్రమే నమోదు చేసుకోవాలని వారు వివరించారు. ఇందులో ప్రధాన ఉపాధ్యాయురాలు సైదమ్మ, ఉపాధ్యాయులు మమత, వినయ రాణి, కవిత, నిర్మల, చంద్రశేఖర్, చంద్రకళ, వేణు గోపాల్‌రావ్ పాల్గొన్నారు. రెండు పాఠ శాలల నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

తనిఖీలు నిర్వహిస్తున్న నోడల్ అధికారుల రామకృష్ణారెడ్డి, లక్ష్మి తదితరులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

జిహెచ్ఎంసి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త అమీన్‌పూర్, పటాన్‌చెరు బల్దియా సర్కిళ్ల పరిధి లో చేపడుతున్న అభివృద్ధిపనుల్లో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాల్లో రాజీపడకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జిహెచ్ఎంసి అధికారులను ఆదేశిం చారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు, అమీన్‌పూర్ సర్కిళ్ల పరిధిలోని డివిజన్లో చేపడు తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదిక లపై చర్చించారు. ప్రధానంగా మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇండోర్ స్టేడియం, అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల లో వేగం పెంచాలని సూచించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న వార్డు కార్యాలయాన్ని ప్రత్యేకతను పూర్తిచేయాలన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలోగల వివేకానంద స్టేడియం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 27 కోట్ల రూపాయలు మంజూరు చేశాయని, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభిం చాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో స్లాటర్ హౌస్ (పశు వధశాల) నిర్మించబోతున్నట్లు తెలిపారు.10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో, ఆధునిక వసతులతో నూతన టెక్నాలజీతో నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములలో లేఔట్లు, అనుమతి లేని నిర్మా ణాలు కొనసాగకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలుచేస్తూ, కబ్జాదారులపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఎమ్మార్వో హరిబాబు, రామ చంద్రాపురం తహసీల్దార్ సరస్వతి, విద్యుత్ శాఖ డిఈ భాస్కరరావు, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డిఈ రామస్వామి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

'వార్త'కు స్పందన

ప్రభుత్వ భూమిలో నిర్మించిన మరుగుదొడ్ల కూల్చివేత

కొండపాక, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: కొండపాక శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 157లో 2 ఎకరాలు కబ్జాకుగురైందని కోట్ల విలువైన ప్రభుత్వభూమి ఒక ప్రైవేట్ పాఠశాల యాజమాని కబ్జా చేశారంటూ జనవరి 19న 'వార్త'దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ హైమావతి, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని ఆదేశించగా, ఆదేరోజు సర్వేయర్, ఆర్ఐ బాలకిషన్, రెవెన్యూ సిబ్బందిని అట్టి భూమిని సర్వే చేయాలని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం అక్రమించిన ప్రభుత్వ భూమిలో ఇది ప్రభుత్వ భూమి దీనికిలోకి ఎవరు ప్రవేశించిన శిక్షార్హులంటు ప్లేక్సిని ఏర్పాటు చేశారు. సోమవారం భూమి సర్వే నివేదిక అందడంతో అట్టి ప్రభుత్వ భూమిలో పాఠశాల యాజమాన్యం నిర్మించిన మరుగుదొడ్లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సూచనలతో రెవేన్యూ సిబ్బంది సాయంత్రం కూల్చి వేశారు. అనంతరం అక్రమనకు గురైన భూమిని స్వాదీనం చేసుకున్నారు.

ప్రమాదంలో మృతదేహాలు

ఆటోను ఢీకొన్న ట్రక్కు

-ఇద్దరు మృతి, మరో ముగ్గురికి గాయాలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ఎదురుగా వస్తున్న ట్రక్కు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెంద గా మరో ముగ్గురు తీవ్ర గాయాలకు గురైన సంఘటన సోమవారం గంగ్వార్-బీదర్ రోడ్డుపై పోలీసు ఠాణాపరిధిలోని హుసెల్లి గ్రామ శివారు లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... గంగ్వార్ నుంచి కర్ణాటకలోని బీదర్ పట్టణం వెళు తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ట్రక్కు బలంగా ఢీకొంది. ప్రమాదంలో మండల పరిధిలోని వడ్డి గ్రామానికి చెందిన అంగన్‌వాడి టీచర్ కమల (40), ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండాకు చెందిన అంబ్యా నాయక్ (55)లు అక్కడికి అక్కడే ఆటోలనే ఇరుక్కుని మృతి చెందారు. ప్రమాదంలో మరో 5 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. క్షతగాత్రు లను కర్ణాటకలోని బీదర్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రోడ్డుపై జరిగిన ప్రమాదంతో ఆటుగా వస్తున్న వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరిం చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. హద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రామాయంపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : ఉరేసుకుని ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో జరిగింది.ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం... అక్కన్నపేటకు చెందిన రాగి యాదమ్మ(40) ఇటీవల కుమారుడు ఆత్మహత్య చేసుకోగా అప్పటినుంచి మనస్థాపంతో ఉన్న యాదమ్మ చెట్టుకు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకుంది. కుటింబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాసు పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

8 మందికి జరిమానా

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా విధించడంతోపాటు జైలుశిక్ష విధించడం జరిగిం దని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి 8 మందికి రూ.71,500 జరిమానా విధించడంతోపాటు మరో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష విధించారని తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఏడుగురికి రూ.35వేల జరిమానా విధించడం జరిగిందన్నారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

మూడు ద్విచక్ర వాహనాల స్వాధీనం

మెదక్ టౌన్ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ కేసు వివరాలను వెల్లడించారు.నర్సిములు అనే వ్యక్తి పని నిమిత్తం మెదక్‌కు వచ్చి, ఆటో నగర్‌లోని వన దుర్గ భవాని వైన్స్ షాప్ ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.సోమవారం బోధన్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో, ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి పట్టుకుని విచారించారు. విచారణలో అతని పేరు కమ్మరి రాములుగా గుర్తించినట్లు తెలిపారు.విచారణలో అతడు పలు ద్విచక్ర వాహనల దొంగతనలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతడు గతంలో కూడా మెదక్, రామాయంపేట పరిసర ప్రాంతాల్లో అనేక ద్విచక్ర వాహన దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చిన పాత నేరస్తుడని వెల్లడించారు. అతనిపై మెదక్ మరియు రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు ఆరు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుండి మొత్తం మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

వివరాలు తెలుపుతున్న ఇన్స్పెక్టర్ మహేష్

జంగమయ్య గుట్టలో జాతర ప్రారంభం

జంగమయ్య గుట్టలో ప్రారంభమైన జాతర

సదాశివపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
సదాశివపేట మండలం తంగేడుపల్లి గ్రామంలోని శ్రీకోటిబిల్వలింగేశ్వర మఠం గురుగంగాధర మహాస్వామి ఆశ్రమం జంగమయ్యగుట్ట 30వ వార్షిక ఉత్సవాలు ఈరోజు అంగరంగవైభవంగా ప్రారంభించారు. ఆశ్రమం పీఠాధిపతులు శివయోగి శివాచార్యమహాస్వామి వారిచే ప్రథమంగా పంచాచార్యుల ధ్వజారోహణం నిర్వహించడం జరిగింది. తదుపరి గంగామాత పూజ, సకలదేవతా స్వరూపిణి గోమాతపూజ, తదుపరి గోమాతతో యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గణపతి, గౌరీ స్వస్తి పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, చండీహవనం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అర్చకులు మడివాలయస్వామి, జంగం మహేష్‌స్వామి, విజయస్వామి, ఓంకార్ స్వామి, బన్నయ్యస్వామి, సంగమేశ్వర్, వినోద్‌కుమార్, చండీహోమంలో తంగడపల్లి, అంకెనపల్లి, సదాశివపేట, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

టేక్మాల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
టేక్మాల్ ఆదర్శ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్స్పాల్ సుంకరి సాయిలు తెలిపారు. సోమవారం టేక్మాల్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక్కరోజు తమ తోటివిద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీపట్టి చదువుకునే విద్యార్థులు ఉపాధ్యాయులుగా కొలువుదీరారు. స్వయంపాలన దినోత్సవాన్ని వేడికగా చేసుకుని చదువులు చెప్పారు. నాయకత్వ లక్షణాలను కనబర్చడానికి వివిధ పదవులలో విద్యార్థులు చక్కగా వ్యవహరించారు. జిల్లా కలెక్టర్‌గా నైత్రిక, డిఈవోగా హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈవో ఆరాధ్య, ప్రిన్సిపాల్‌గా సేవిత్ విహారిలు వ్యవహరించారు. విద్యార్థులు బోధిస్తున్న తీరుతెన్నులను పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు బోధనతీరును పరిశీలించారు. స్వయంపాలన దినోత్సవంతో పాఠశాలలో విద్యార్థులు సందడిచేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి చేసిన బోధనతీరును పరిశీలించి వారి ప్రతిభ ఆధారంగా ఉత్తమ ప్రతిభావంతులను గుర్తించారు.

సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు

లైట్లు వేయిస్తున్న సర్పంచి రాజేందర్‌రెడ్డి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
చిలిపిచెడ్ మండలంలోని శీలంపల్లి గ్రామంలో సర్పంచి రాజేందర్‌రెడ్డి తన సొంతనిధులు రూ.65వేలతో నాలుగు వీధుల్లో అండర్ డ్రైనేజీ పైప్‌లైన్లు వేయించారు. అలాగే గ్రామంలోని ప్రతి విద్యుత్తుస్తంభానికి 60వాట్స్ బల్బులు రూ.50వేలతో 60బల్బులు ఏర్పాటుచేయడం జరిగింది. తన సొంతనిధులు ఒక లక్ష పదిహేను వేల రూపాయలతో పలు కార్యక్రమాలకు శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు నవీన్‌రెడ్డి, శేఖర్, గ్రామస్థులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగండభేరుండ లక్ష్మీనరసింహస్వామి జాతర

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కళ్యాణమండప దృశ్యం

నర్సాపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని శ్రీగండభేరుండ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈమేరకు లింగాపూర్ సమీపంలోని నరసింహుల గుట్టపైన వెలసిన శ్రీ గండభేరుండ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం కన్నులపండుగగా జరుగగా స్వామివారికి ప్రత్యేకపూజలు వంటి కార్యక్రమాలు ఆలయ పూజారులు కృష్ణమాచార్యులు, సుదర్శనచార్యుల వేదమంత్రాల మధ్యన ఘనంగా జరిగాయి. అదేవిధంగా గుమ్మడమ్మ దేవత వద్ద అగ్నిగుండాలు, బండ్లు బోనాల ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. అంతేగాక ఈ మహోత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన చంది శోభారాణి శ్రీనివాస్‌గౌడ్‌ల సహకారంతో సొంతనిధులతో గతంలో కళ్యాణమండపాన్ని నిర్మించగా ఈ సంవత్సరం ఆలయంముందు గరత్మంతుడు, వీరహనుమాన్ భారీ విగ్రహాలను నిర్మించారు. గత మూడురోజులుగా శ్రీగండభేరుండ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణమహోత్సవాలు ఘనంగా జరిగాయి. అయితే మంగళవారం పాచిబండ్లు ఊరేగింపు, బుధవారం మరల శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహాలు తిరిగి గ్రామానికి వెళ్ళుట వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతరకు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికృపకు పాత్రులు అయ్యారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాజకళ శ్రీనివాస్‌గుప్తా, మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, దాత చంది శోభారాణి శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ నిర్వాహక కమిటీసభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాల్‌కల్ జాతరలో కుస్తీ పోటీలు

-హాజరవుతున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామశివారులోని కొండగట్టుపై ఈ నెల 30వ తారీఖు నుంచి కొనసాగుతున్న ఉర్సే షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న జాతర ఆవరణలో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగనున్నాయి. కుస్తీపోటీలను తిలకించి దర్గాను దర్శించుకునేందుకు జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి హాజరవుతున్నట్లు న్యాల్‌కల్ సొసైటీ మాజీ చైర్మన్ సిద్ధలింగయ్యస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతరలో కొనసాగే కుస్తీపోటీలలో తలపడేందుకు తెలంగాణరాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి మల్లయోధులు తరలివచ్చి యువత కేరింతలు, ఈలలు వేస్తుండగా నువ్వానేనా అన్న రీతిలో కుస్తీ పడుతుంటారు.

రెబల్ అభ్యర్థులు నామినేషన్‌లు ఉపసంహరించుకోవాలి

-మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించాలి
-కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి రాజిరెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
నర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనుండి రెబల్ అభ్యర్థులు వెంటనే తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పార్టీనుండి సస్పెండ్‌చేస్తామని కాంగ్రెస్‌పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. ఈ నేపథ్యంలో నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని వారు అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని 6,7వార్డుల్లో మున్సిపాలిటీ ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డిలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తుందని, కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారంటీల ద్వారా ప్రతి ఇంటికి అభివృద్ధి, సంక్షేమంతో లబ్ది చేకూరుతుందని అన్నారు. అంతేగాక నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిని కాంక్షిస్తూ, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అందరూ ఏకతాటిపై నిలిచి శక్తివంచన లేకుండా కృషిచేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షులు మల్లేశం, రెడ్డిపల్లి సర్పంచి పద్మావతి అశోక్‌గౌడ్, సుధీర్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపండి

-ఎంపిడిఓకు వినతిపత్రం అందచేసిన నాయకులు

ఎంపిడిఓకు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అల్లాదుర్గం కంచరి అసెంబ్లీ సాధనకమిటీ అధ్యక్షులు కంచరి బ్రహ్మం ఆధ్వర్యంలో నాయకులు ఎంపిడిఓ వేద ప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, గణపతి, భూమేష్, సంతోష్, శివకుమార్, ఆయాగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నీటి సరఫరా పనులను పరిశీలిస్తున్న డిఈ

మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలిస్తున్న డిఈ సృజన్‌చక్రవర్తి

ఝరాసంగం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
వచ్చే వేసవికాలాన్ని దృష్టిలోపెట్టుకుని మండలంలో నీటిసరఫరాకు ఇబ్బందులు కలగకుండా ముందుస్తు జాగ్రత్తలో భాగంగా సోమవారం మిషన్ భగీరథ డిఈ సృజన్ చక్రవర్తి మండల పరిధిలోని సిద్దాపూర్, భోజ్యానాయక్ తాండ, వనంపల్లి, కక్కరవాడ, చీలపల్లి తాండ తదితర గ్రామాల్లో జీతాలు అందడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులతో కలిసి పర్యటించి నీటి సరఫరా పనులను పరిశీలించారు. ఎండాకాలంలో ప్రజలు తాగునీటికోసం కష్టపడకుండా నిత్యం తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలుతీసుకుంటున్నట్లు సృజన్ చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఒకే ఒక దరఖాస్తు

అల్లాదుర్గంలో ప్రజావాణి కార్యక్రమం దృశ్యం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలం నుంచి ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు మండల అభివృద్ధి అధికారి వేద ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు వేద ప్రకాష్‌రెడ్డి సూచించారు. సోమవారం మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ఒకే ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందని ఎంపిడిఓ వేద ప్రకాష్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతులు నైపుణ్యంతో అధిక రాబడి గడించాలి

-జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

గుమ్మడిదల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
నల్లవల్లి గ్రామంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారిణి అనూషరెడ్డి గ్రామసర్పంచి రాణిసురేష్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషివిజ్ఞానం యోజన, వర్షాధరిత పంటల అభివృధి పథకంలో అర్హులైన రైతులకు వర్మీ బ్యాగులు సరఫరా చేయడం జరిగింది. కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ నుండి వివిధ పథకాలు అందించడం జరుగుతుంది కాబట్టి రైతులు సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు సాధించాలని ఉద్యానశాఖ అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి పోచయ్య, వార్డుసభ్యులు కమ్మరి రాము, రాగుల నర్సింలు, మంజులఅశోక్, సాయిలు, మాజి ఎంపిటిసిలు కిష్టాగౌడ్, బిక్షపతి, రైతులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తా

-9వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్‌గుప్తా



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్‌గుప్తా

నర్సాపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్‌గుప్తా అన్నారు. సోమవారం 9వ వార్డులో పర్యటించి ఇంటింటికీ వెళ్లి తన ప్రచారాన్ని సాగించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్‌గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున అన్నిరంగాల్లో వార్డును అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు అవుతాయని అన్నారు. దీంతో వార్డులో నెలకొన్న ఏ సమస్య అయినా పరిష్కరిస్తానని అదే విధంగా వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని కౌన్సిలర్ అభ్యర్థి శ్రీధర్‌గుప్తా అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డుప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో త్యాగరాజ ఆరాధన

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం త్యాగ రాజ ఆరాధన-2026 వేడుకలను సంగీత కార్యక్రమాల ద్వారా ఘనంగా నిర్వహించి, ఆయనకు ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కర్ణాటక సంగీతాన్ని ఓపెన్ ఎలక్టివ్‌గా, మైనర్ ప్రోగ్రామ్‌గా ఎంపికచేసుకున్న విద్యార్థులు త్యాగరాజకీర్తనలను హృద్యమంగా ఆలపించారు. వారికి వయోలిన్‌పై మహావాది వాసు, మృదంగంపై ఎం.చంద్ర కాంత్ సహకారం అందించారు. లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై.లలితాసింధూరి పర్యవేక్షణలో, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆనందు మురళి, దర్భా మృదురవళి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

నర్సాపూర్ కాంగ్రెస్‌లో భారీ చేరికలు

-కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి
-నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి



పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి భారీ సంఖ్యలో ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలో ఇచ్చిన ఆరోగ్య అంటీలు అమలు చేసిందని అదే విధంగా పేద ప్రజలకు ఇంటింటికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలను ప్రజలు ఎందరో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ మేరకు నాగులపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరడం తో కాంగ్రెస్ పార్టీ మరింత హలోపేతమయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుమతి శివకుమార్, మాజీ పిఎస్‌సిఎస్ చైర్మన్ రాజు యాదవ్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం, మాజీ ఎంపీటీసీ మేఘమాల కిషన్, వార్డు సభ్యులు ఎండి ఫయాజ్, ఇంద్రసేనారెడ్డి, కొర్పోల్ నర్సింలు, రహీం, రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నార్సింగి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్ ధాత్రికాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు సోమవారం ప్రజావాణిలో డిసి సురేందర్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈసందర్భంగా కాలనీ అధ్యక్షులు శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ మాకాలనీలో వీధిదీపాలు వెలుగక పోవడంతో రాత్రిసమయంలో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని, అలాగే ఇనుప కరెంటుస్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయని వీటిని తొలగించి సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. పార్కులను అభివృద్ధి చేయాలని, 12.మట్టి రోడ్లు ఉన్నాయని, వాటిని సీసీ రోడ్లుగా మార్చాలని పేర్కొన్నామన్నారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ఎప్పుడు ఎవరిని కరుస్తాయో నని బిక్కుబిక్కుమంటూ కాలనీవాసులు భయపడుతున్నారన్నారు. వెంటనే వీధికుక్కల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో డిసిని కోరామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఆనందరెడ్డి, సంయుక్త కార్యదర్శి జగన్నాథ స్వామి, కోశాధికారి కామేశ్వర్‌రావ్, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, హరీఓం, భార్గవ పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: తెలంగాణరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ 10వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని, నగరంలోని గుర్రంగూడలో గల జిఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఒకరోజు రాష్ట్రస్థాయి క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.చిరంజీవి, సెక్రటరీ వల్లభనేని ప్రసాద్, వి.భారతి వివరించారు. చిక్కడపల్లిలోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ డీఫ్ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీలలో మహిళా, పురుషుల డీఫ్ జట్లు పాల్గొంటాయని, క్రీడాభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి ఈ మ్యాచ్‌ను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డి జాతీయ కన్వీనర్ కాటమోని వెంకటేష్‌గౌడ్‌తో పాటు పలువురు డీఫ్ ప్రతినిధులు పాల్గొని తమమద్దతును తెలియజేశారు. క్రీడాకారుల ప్రతిభను చాటేందుకు ఇదొక గొప్పవేదిక అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అందరు భాగస్వాములే ఇన్‌స్పెక్టర్ మల్లేశం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ మల్లేశం అన్నారు. సోమవారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ నూతనంగా ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా సోమవారం ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎలైట్స్ ఐఏఎస్ అకాడమి మాజీ చైర్మన్ డా.ఎకె గిడియన్‌బాబు నేతృత్వంలో మల్లేశంను సత్కరించారు. మల్లేశం మాట్లాడుతూ విధినిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేస్తారని ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. ప్రజల సహకారం ఉంటే ఎలాంటి కేసులనైనా ఛేదించడం సులభమవుతుందన్నారు.

బిసి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో బిసిలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమరశీల పోరాటాలను నిర్వహించాలని జాతీయ బిసిసంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా కామరాజు సతీష్‌కుమార్‌ను నియమించి, నియామకప్రతాన్ని అందజేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు కామరాజును నియమించడం జరిగిందన్నారు. వచ్చే మున్సిపల్, జిహెచ్ఎంసి, ఎంపిటిసి ఎన్నికల్లో బిసి అభ్యర్థులు విజయం సాధించేందుకు బిసిలు పెద్ద ఎత్తున కృషిచేయాలని కోరారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ జంటనగరాలో బిసి ఎదుర్కొంటున్న సమస్యలపరి ష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అభిలాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ హుస్సేన్ జయంతి

చార్మినార్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: జామియా మిలియా ఇస్లామియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జామియా మిలియా ఇస్లామియా సెంట్రల్ యూనివర్శిటిలోని డాక్టర్.ఎం.ఎ.అన్సారీ ఆడిటోరియంలో జరిగిన ఇమామ్‌హుస్సేన్ జయంతి కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన మాజీ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్‌లో మాట్లాడుతూ ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా సెంట్రల్ యూనివర్శిటిలోని డాక్టర్.ఎం.ఎ.అన్సారీ ఆడిటోరియంలో ఘనంగా జరిగిన ఇమామ్ హుస్సేన్ జయంతి కార్యక్రమం దేశంలోని పలుప్రాంతాలకుచెందిన ప్రముఖులు పాల్గొన్నారని తెలిపారు.

కాలాపత్తర్,కామాటిపుర పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఫ్లాగ్‌మార్చ్

చార్మినార్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: హైదరాబాద్ పాతబస్తీలో అత్యంత కీలకమైన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్, కామాటిపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం రాత్రి ఫలక్‌నుమా ఏసిపి జావిద్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఫలక్‌నుమా ఏసిపి జావిద్, కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌ఫాషా స్థానిక పోలీసులతోపాటు ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో కలిసి కాలాపత్తర్, ఇంద్రానగర్, భాజాపహాడి బస్తీలలో పర్యటించారు. ఈసందర్భంగా ఫలక్‌నుమా ఏసిపి జావిద్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి పుకార్లను నమ్మవద్దని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. కాగా కామాటిపుర పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ పురానాపూల్, దర్వాజ, దేవిబాగ్ రహదారి, బహదూర్‌పుర చౌరస్తా ప్రాంతాలు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం సుదర్శన హోమం

నాచారం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: బిజెపి మేడ్చెల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు, రేణుక ఆధ్వర్యంలో సోమవారం నాచారం కార్తికేయనగర్‌లో లోకకళ్యాణం కోసం సుదర్శనహోమం నిర్వహించారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు నరసింహమూర్తి పర్యవేక్షణలో అర్చక బృందం అంగరంగ వైభవంగా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు హోమం ప్రాముఖ్యత విశిష్టతగురించి భక్తులకు ఉపదేశించారు. సుదర్శనహోమం నిర్వహించడం ద్వారా నిర్వహకులతోపాటు స్థానికప్రజలకు అనేక శుభ ఫలితాలు లభిస్తాయని పండితులు పేర్కొన్నారు. అధికసంఖ్యలో మహిళలు, భక్తులతోపాటు బిజెపి, కాంగ్రెస్, టిడిపి నాయకులత

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడిగా కొమురవెల్లికిచెందిన మహాదేవుని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని వీరశైవ లింగాయత్ సమాజ భవనంలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో మహాదేవుని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకుల ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవి ఒక బాధ్యతగా భావించి జిల్లాలోని అన్నివర్గాలను కలుపుకొని సమజాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో రుద్రభూమి, బసవ భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమపై నమ్మకం ఉంచిన వీరశైవులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు నరుకుల శివప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడె ఆకుల భద్రప్ప, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బెజ్జంకి మండలాన్ని కరీంనగర్‌లో కలపాలి

వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

బెజ్జంకి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లా నుంచి తొలగించి కరీంనగర్ జిల్లాలో కలపాలని బిజెపి మండల అధ్యక్షులు కొలిపాక రాజు సూచన మేరకు సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు బిజెపిశ్రేణులు స్థానికులతోకలిసి వినతిపత్రాలు అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్‌కు సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు సంగ రవి, బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : సర్పంచ్

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రవళి

బెజ్జంకి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో ఉపాధిహామీలో చేపడుతున్న రోడ్డు నిర్మాణం పనులకు సర్పంచ్ చిట్యంపల్లి రవళి సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా సహకరించాలన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. పేదలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకుడు గాజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : సర్పంచ్

మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

కొమురవెల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : గ్రామాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు అన్నారు. కొమురవెల్లిలో సోమవారం నూతనంగా నిర్మించ తలపెట్టిన మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా సంఘం భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, కార్యదర్శి సి.హెచ్. కరుణాకర్, వార్డుసభ్యులు స్రవంతి, నర్సింలు, వెంకటేష్, స్వప్న, నాగరాజు, వెంకటేష్, శ్రీలత,సాగర్, మానస శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లేశం, బాలమణి, నాగరాజు, మహేష్, మహిళా సంఘం వివోఎ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు : డిఎం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: బిహెచ్ఈఎల్ లింగంపల్లి నుంచి కుక్కి సుబ్రమ్మణ్య స్వామి, ఉడిపి, మురుడేశ్వర్ ఆలయాల మీదుగా గోవా వెళ్లి తిరిగి లింగంపల్లికి చేరుకునేందుకు మార్చి 1వ తేదీ ఉదయం 6 గంటలకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవా నుంచి ఎంజిబిఎస్ మీదుగా లింగంపల్లికి బస్సు చేరుకుంటుందన్నారు. ప్రయాణీకులు 5130 రూపాయలతో టికెట్‌ను బుక్ చేసుకోవాలని, సర్వీసు నంబరు 97788గా పేర్కొన్నారు.

గర్భిణీలకు వరం 'అమ్మఒడి'

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: అమ్మఒడి పథకం గర్భిణీలకు వరంగా మారిందని పైలట్ బైరి శ్రీధర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని ఏరియా హాస్పిటల్‌లో ఈ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు అమ్మ ఒడి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు 102 సేవకు కాల్‌చేస్తే, ఇంటి వద్దకే వాహనం వెళ్లి వారిని ఏరియా హాస్పిటల్, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వరకైనా తరలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తిరిగి అదే వాహనంలో ఇంటి వద్ద దింపడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో గర్భిణీలకు ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంఈ హరి రామకృష్ణ, ప్రోగ్రాం మేనేజర్ బోయిని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి పథకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అధికారుల గైర్హాజరుతో వెలవెలబోతున్న 'ప్రజావాణి'

మునిపల్లి, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు లేక తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోయింది. ప్రతి సోమవారం అధికారులు గైర్హాజరు అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. మండలంలో వివిధశాఖల అధికారులది ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. మండలంలో తమను ప్రశ్నించే వారు లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు పలుమార్లు మండలాన్ని సందర్శిస్తున్నా వీరిలో మార్పు రావడంలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం చేపట్టే ప్రజావాణి కార్యక్రమాన్ని సైతం లెక్క చేయడం లేదంటే వారి నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. సోమవారం ప్రజావాణిలో తహసీల్దారు, ఎంపిడిఓ, విబిజిరాంజి, ఐకెపిలకు సంబంధించిన సిబ్బంది మాత్రమే కన్పించారు. మిగతా అధికారులు గైర్హాజరైనట్టు డిప్యూటీ తహసిల్దార్ ప్రదీప్ తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవంచుకోవడానికి సంబంధిత అధికారులు లేకపోవడంతో మండల ప్రజలు వెనుదిరిగిపోతున్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయనప్పటి నుంచి నేటి వరకు అధికారుల తీరుతో ప్రజలకు ఈ కార్యక్రమం ఉపయోగం లేకుండాపోతోంది. ప్రజవాణి కార్యక్రమం తమకు పట్టనట్టు అధికారులు వ్యవహరిస్తున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..గతంలో పలుమార్లు మనిపల్లి ప్రజావాణిని ఫిర్యాదుల కోసం వెళ్లిన ఫిర్యాదు దారులకు సంబంధిత అధికారులు గైర్హాజరు కావ డంతో సంగారెడ్డిలోని ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రతి సోమవారం ప్రజావాణికి గైర్హాజరు అవుతున్న వివిధశాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణిలో అధికారులు లేక వెలవెల బోయిన దృశ్యం

మాట్లాడుతున్న ఏఎస్ఐ

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన ఉండాలి : ఎఎస్ఐ

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : ప్రజలు సైబర్ నేరాలతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ సుధాకర్ అన్నారు. సోమవారం రోజున మండలంలోని కూచనపల్లి గ్రామంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాలమేరకు, పోలీస్ కళాబృందం సభ్యులు డయల్ 100 సేవల వినియోగం, బ్లూ కోల్ట్స్ తక్షణ స్పందన, హెల్మెట్ తప్పనిసరి వినియోగం, మైనర్ రైడింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాల్సిన అవసరం గురించి వివరించారు. బ్యాంకులు ఎప్పుడూ ఓటీపీ అడగవని ప్రజలకు స్పష్టం చేశారు. గ్రామ భద్రత మరింత పటిష్టంగా ఉండేందుకు ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ విపిఓ రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపిడివో

విజేతలకు మెమోంటోలు అందిస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : క్రీడలు శారీరక ఉల్లాసానికి ఎంతో మేలు చేస్తాయని..విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపిడివో మార్టిన్ లూథర్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం సిఎం కప్ 2025-26 క్రీడలు పండగ వాతావరణంలో నిర్వహించారు. క్రీడల్లో మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల నుంచి 235 మంది క్రీడాకారులు పాల్గొని ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఎంపిడివో, తహశీల్దార్, ఎంఈవో చేతుల మీదగా మెమోంటోలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపొటములు సహజమని నేటి ఓటిమి రేపటి గెలుపు నాంది అన్నారు.ప్రభుత్వం క్రీడ రంగానికి పెద్ద పీట వేస్తుందన్నారు. క్రీడపోటీలు విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడ ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు,ఉపాధ్యాయులు, పిఈటిలు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టపర్తి సాయిబాబా జయంతి ఉత్సవాలు

కొండాపాక, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : భగవాన్ శ్రీసత్య సాయిబాబా జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి నుండి స్వామివారి రథయాత్ర సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సాయిబాబా భక్తులు రథానికి మహిళలు మంగళ హారతులతో, కోలటలాతో భజనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రధానం వీధులగుండా సాయిబాబా రథ శోభయాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బూర్గుపల్లి సేవా సమితి, కుకునూరుపల్లి భజన మండలి సంయుక్తంగా రథయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సత్య సాయి సేవా సంస్థల జిల్లా డిపిఒ నర్సింలు, కన్వీనర్‌బాల్‌నర్సయ్య, నందకిషోర్ శర్మ, నరేష్,రఘుపతి, కార్యదర్శి స్వప్న, పద్మారెడ్డి, ఉప్పల రాజు పాల్గొన్నారు.

శ్రీసత్య సాయిబాబా రథయాత్రకు స్వాగతం పలుకుతున్న భక్తులు

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తప్పు చేస్తే చట్టానికి ఎవరైనా ఒక్కటే

-కాంగ్రెస్ పార్టీ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ ప్రభుత్వ పాలన అవినీతి అక్రమాలతో సాగిందని, తప్పు చేస్తే చట్టానికి ఎవరైనా ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రభాకర్, మల్లేశం, అంజాగౌడ్, రామాగౌడ్, బాలరాజ్‌గౌడ్‌లు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వగా, ఇది జీర్ణించుకోలేని అహ్మదీపూర్ బిఆర్ఎస్ నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి దగ్ధం చేయగా ఆగ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కెసిఆర్, హరీష్‌రావుల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించిన కెసిఆర్ కాంట్రాక్టులన్నీ వారికే అప్పగించగా వచ్చిన కమీషన్లతో కెసిఆర్ కుటుంబం జల్సాలు చేస్తున్నట్లు విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చట్ట విరుద్ధమని తెలిసినప్పటికీ దొంగచాటుగా సొంత అల్లుడితో పాటు ప్రతిపక్ష నేతలు, సినిమా హీరోయిన్ల ఫోన్‌లు ట్యాపింగ్ చేసినట్లు ఆరోపించారు. తప్పు చేయకుంటే భయం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఫెర్టిలైజర్ యాప్ ఐడితోనే యూరియా కొనుగోలు చేయాలి

-మండల వ్యవసాయాధికారి ప్రగతి

ములుగు, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): మండల పరిధిలోని రైతులు తప్పనిసరిగా ఫెర్టిలైజర్ యాప్ ద్వారా బుక్ చేసుకొని యూరియాను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రగతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గతంలోలాగా దుకాణాల వద్దకువెళ్లి యూరియాను కొనుగోలు చేయడం కుదరదని, ఫెర్టిలైజర్ యాప్ బుకింగ్ ఐడితోనే వెళ్లి కొనుగోలు చేయాల్సి వుంటుందన్నారు. ఈ ఫెర్టిలైజర్ యాప్‌ను రైతులు తమ ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పట్టాదారు పాస్‌బుక్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి ఎరువులను బుక్ చేసుకోవచ్చన్నారు. కౌలు రైతులకు కూడా ఈ అవకాశం కల్పించడం జరిగిందని, దీనివల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందన్నారు.

బిఆర్ఎస్ నేతను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని 11వ వార్డుకి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు చౌకత్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లయాక్, అంబదాస్ వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఒక సిసి కెమెరా వందమందితో సమానం : సిఐ

జోగిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: వందమందితో సమానమనటువంటి నిఘాను ఒక సిసి కెమెరా చేస్తుందని జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం జోగిపేట ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50వేలను సిఐకి అందచేశారు. ఈ సందర్భంగా సిఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ చాలామట్టుకు జరిగే దొంగతనాలు, నేరాలను చేధించటంతో సిసి కెమెరాల పాత్ర చాలా కీలకంగా మారిందని తెలిపారు. యాభై వేల విరాళంతో వెంటనే జోగిపేట బైపాస్ రోడ్డు, డబుల్ బెడ్రూంలు ఉన్న ఏరియాలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సిఐ తెలిపారు. ఈ మేరకు వెంటనే ఆమొత్తాన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేసే టెక్నిషియన్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ తరపున విష్ణువర్ధన్, రామకృష్ణలు పాల్గొన్నారు.

సిఐకు సిసి కెమెరాల ఏర్పాటు నిమిత్తం విరాళం అందచేస్తున్నదృశ్యం

బకాయిలు చెల్లించాలంటూ కార్మికుల ధర్నా

జహీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ చక్కర కర్మాగాంలో పనిచేసిన తమకు బకాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కార్మికులు కర్మాగారం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజి రాములు యాదవ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా మూతపడిన కార్మాగారాన్ని ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఓ చక్కర కంపెనీ కొనుగోలు చేసిందని, కొనుగోలు చేసిన నూతన యాజమాన్యం క్రషింగ్ నిర్వహించేందుకు గత కొన్ని రోజులుగా కర్మాగారం లోపల యూపీ, బీహార్,చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులతో పనులు చేయించుకుంటున్న తెలుసుకున్న పాత కార్మికులు గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో పాత బకాయిల వసూలు కొరకు ధర్నాచేస్తూ వస్తున్నా, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు అందచేస్తూ వచ్చిన ప్రయోజనం లేకపోవడంతో కంపెనీ గేటును మూసేసి పనులను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. పర్మనెంట్ కార్మికులకు సంబంధించిన పాత బకాయి వేతనాలు, ఫిఎఫ్, ఈఎస్ఐ లాంటివి వెంటనే చెల్లించి కారర్మికులను పనుల్లోకి తీసుకోవాలని కార్మికసంఘం అధ్యక్షులు యంజి రాములు యాదవ్ డిమాండ్‌చేశారు. కర్మాగారం యాజమాన్యం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని రాములు యాదవ్ హెచ్చరించారు.

వేతన బకాయిలు చెల్లించాలని ట్రైడెంట్ చక్కర కర్మాగారరం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేత

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : రోడ్ భద్రత మాసోత్సవాల నేపథ్యంలో ఇటీవల హుస్నాబాద్‌లోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోడ్డు రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, రంగోలి, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ యోగేశ్వర్ సింగ్ జాదవ్ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం అవసరమని, విద్యార్థులు రోడ్డునియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ విని యోగించాలన్నారు. ప్రతీ విద్యార్థి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం వంటి అంశాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్‌తో పాటు రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

మైసమ్మతండా సర్పంచ్ కృష్ణానాయక్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా సర్పంచ్ భూక్యకృష్ణానాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా ఫిబ్రవరి 15వ తేదీన సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించుకుంటామని, అయితే గత ప్రభుత్వం ఈ జయంతి వేడుకలు నిర్వహించేందుకు తండాలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసేదని, గత ప్రభుత్వంలాగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు గిరిజనుల అభివృద్ధికి ముందుకు రావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'రైతులకు యూరియా అందుబాటులో ఉంది'

హాకా సర్వీస్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

మర్కుక్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): మండల పరిధిలోని గణేష్‌పల్లిలో గల హాకా సర్వీస్ సెంటర్‌ను సోమవారం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.అనిల్‌కుమార్ సందర్శించి ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు యూరియా యాప్ వినియోగించే విధానాన్ని వివరించారు. మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు జిల్లాలో ఎక్కడి నుంచి అయినా ఈ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. అలాగే కౌలు రైతు పట్టాదారు అనుమతితో యూరియాను పొందవచ్చని పేర్కొన్నారు. హాకా సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి బి.రాము, హాకా సెంటర్ నిర్వాహకులు నగేష్, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 2(ప్రభాతవార్త): మండల కేంద్రంలో సోమవారం సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలేని ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులకు హాజరై ఉపాధి పొందాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు ఘననివాళి

సౌమ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గజ్వేల్, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త): విధి నిర్వహణలో గంజాయి స్మగ్లర్ల దాష్టీకానికి బలైపోయిన నిజామాబాద్ ఎక్సైజ్‌కానిస్టేబుల్ గాజుల సౌమ్యకు గజ్వేల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.బ్రహ్మానందరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సాయికృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో...

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య త్యాగం ఎక్సైజ్‌శాఖకే కాకుండా సమాజానికి ఆదర్శమని సిఐలు ఆకుల శ్రీనివాస్, కె.శ్రీధర్, ఎం.సరిత అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విధి నిర్వహణలో భాగంగా గంజాయి స్మగ్లర్లదాడిలో మృతి చెందిన సౌమ్య చిత్రపటానికి సోమవారం కార్యాలయంలో పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గంజాయి స్మగ్లింగ్ వంటి అక్రమ కార్యకలాపాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎ.విజయ్, కిరణ్,పి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు చెన్నగౌడ్, అంజయ్య, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌమ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మల్గిలో పాత పంటల జాతర

పాతపంటల జాతరలో రైతులకు బుర్రకథలు వినిపిస్తున్న కళాకారులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని మల్గిగ్రామానికి జహీరాబాద్‌లోని డెక్కన్‌డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 26వ పాతపంటల జాతర సోమవారం చేరుకుంది. గ్రామానికిచేరుకున్న పాతపంటలజాతరను (పాతపంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్లను) గ్రామరైతులు, డిడిఎస్ కళాకారులు ఎడ్లబండ్లకు పూజాకార్యక్రమాలు నిర్వహించి కోలాటం ఆడుతూ సాంస్కృతిక పాటలను ఆలపిస్తూ గ్రామంలోకి సాదరంగా ఆహ్వానించారు. పాతపంటల ఆహారాన్ని తింటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిడిఎస్ బాధ్యులు పేర్కొన్నారు. పాతపంటల సాగుకు పెట్టుబడులు అంతగా అవసరం ఉండన్నారు. ప్రజలు పాతపంటల భోజనాన్ని తినేందుకు ఇష్టపడుతున్నారని, అందుకు ప్రతిరైతు తమకుగల వ్యవసాయ భూమిలో కొంతమేర అయినా పాతపంటలను పండించాలని సూచించారు.

శ్రీసంత్‌సేవాలాల్ జయంతి గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

ఝరాసంగం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్‌సేవాలాల్ 287వ జయంతిని పురస్కరించుకుని వేడుకలను విజయవంతం చేయాలని బర్దిపూర్‌లోని శ్రీదత్తగిరి ఆశ్రమపీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలో ఈనెల15న నిర్వహించనున్న జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన గోడపత్రికను ఆదివారం ఆశ్రమంలో పీఠాధిపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ కోర్టు పిపి సుభాష్‌రాథోడ్, సేవాలాల్ ఉత్సవసమితి ప్రధానకార్యదర్శి రఘునాథ్ రాథోడ్, డాక్టర్ సుభాష్‌జాదవ్, కోశాధికారి నరేష్‌చవాన్, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా మల్లన్న జాతర

-బోనమెత్తిన కార్పొరేటర్ పుష్పనగేష్

మల్లన్న జాతరలో బోనమెత్తిన కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ మందుములలో కొలువున్న శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతర ఉత్సవాల్లో భాగంగా కమనీయంగా సాగిన మల్లన్నస్వామి కళ్యాణోత్సవం, కనులవిందుగా కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ బోనమెత్తుకుని ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి బోనం సమర్పించారు.

హద్నూర్‌లో ఉపాధిహామీ పనులు ప్రారంభం

-పనులను ప్రారంభించిన సర్పంచి ప్రవీణ్‌కుమార్

ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచి ప్రవీణ్‌కుమార్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని హద్నూర్‌గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పనులను గ్రామసర్పంచి ఎంఆర్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. గ్రామంలోని రైతువేదికలో పనులను ప్రారంభించి ఉపాధికూలీలు ఉపాధిపనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శబ్బీర్‌ఖాన్, మాతంశెట్టి రాజ్‌కుమార్, మంగలి మహేష్, పట్లోళ్ల ప్రవీణ్‌కుమార్, మాతంశెట్టి చంద్రశేఖర్, అశోక్, విజయ్, సంగారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజాలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వండి

వినతి పత్రం అందచేస్తున్న ప్రజలు

చౌటకూరు. ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని తాడ్దానిపల్లి శివారులోని 161వ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజాలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయా రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం టోల్‌ప్లాజా వద్ద నాయకులు నిరసన వ్యక్తంచేసి బాధ్యులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టోల్‌ప్లాజాలో ఉత్తరప్రదేశ్, బీహార్ మహారాష్ట్ర తదితరరాష్ట్రాలకు చెందిన యువకులను నియమించారని ఆరోపించారు. తమ ప్రాంతంలో ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఇతరప్రాంతాల వారికి అవకాశం కల్పిస్తే ఇక్కడి విద్యావంతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్థానిక యువతకు 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించి నెలకు 14వేల రూపాయల వేతనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తగడి మల్లికార్జున్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కాశపాగ ఇమ్మయ్య, బిజెపి నాయకులు చంటి ప్రభు, పల్లె ప్రభుకుమార్‌గౌడ్, బచ్చుగూడెం ప్రవీణ్‌రెడ్డి, పుట్టి మోహన్‌ముదిరాజ్, వెండికోలు ప్రవీన్‌ముదిరాజ్, కలాలి వినోద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో అంకెలు పెరిగితే దళితులకు ఒరిగేదేముంది..?

-సబ్‌ప్లాన్ కేటాయింపులు ఫుల్, ఖర్చులు నిల్

-కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోటారి

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ 9వసారి 2026-27సం. రూ.5347,315కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టింది. దేశంలో 20శాతం ఉన్న దళితులకు సబ్‌ప్లాన్ కింద రూ.1,96,400కోట్లు కేటాయించింది. కేటాయింపులు పెంచడం ద్వారా దళితులకు ఒరిగేదేముందని వాటిని ఖర్చు చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యం వల్ల దళితులకు మరింత అన్యాయం జరుగుతుందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు విమర్శించారు. 102 శాఖలద్వారా కేటాయింపులు చేసిందని, ప్రధానంగా 2025-26 బడ్జెటుతో పోల్చి చూస్తే బడ్జెట్ రూ.13,611కోట్లు కాగా, సబ్‌ప్లాన్ కింద రూ. 1,68,478 కోట్లు, అంబరిల్లా బడ్జెట్ రూ.9540 కోట్లు కేటాయించారని చెప్పారు. సుమారు 2లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినప్పటికీ అవి ఒకేచోట పూల్‌చేసి పెట్టి నోడల్ ఆఫీసర్ వాటిని దళితుల ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయడంలేదని విమర్శించారు. వివిధశాఖల ద్వారా ఖర్చుపెట్టినప్పటికీ ప్రత్యేకంగా దళితులకు ఖర్చు చేయకపోవడంతో వారి సంక్షేమం కుంటుపడుతుందన్నారు. దళితులలో 70శాతంమంది కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోవడంలేదని పేర్కొన్నారు. 60శాతంమంది దళితులు సరైన దుస్తులు, పౌష్టికాహారానికి నోచుకోవడంలేదన్నారు. దళితుల జనాభా 20నుంచి 25శాతానికి పెరుగుతున్నప్పటికీ, బడ్జెట్ మాత్రం 16శాతం దగ్గరే ఆగిందన్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులకేటాయింపులు లేవన్నారు. గ్రామీణప్రాంతాలలో వలసలు పెరిగి, పట్టణాలకు వలసలు వస్తున్న అత్యధికులలో దళితులు ఉన్నారని చెప్పారు. పట్టణాలలో వారికి సరైన నివాసం లేదన్నారు. ఆర్థికంగా అత్యంత బలహీనంగా సామాజికంగా అణచివేతకు గురవుతున్నవారిపై జరిగే దాడులపై, బిజెపి 12 ఏళ్ల పాలనలో దళితులపై మరిన్ని దాడులు పెరిగాయన్నారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి తూట్లు పొడుస్తూ విబిజిరాంజీ బిల్లు తీసుకురావడం ద్వారా దళితుల నోటికాడబుక్క లాగేసిందన్నారు. గతంలో 90శాతం బడ్జెట్ కేంద్రప్రభుత్వం భరించేది. ఇప్పుడు దానిస్థానంలో రాష్ట్రాల మీదికి వదిలేసి 60శాతానికి కేంద్రం తగ్గిం చుకొని 40శాతం రాష్ట్రాలపైన భారం మోపుతుందన్నారు. 125 రోజుల పనిదినాలు పెంచుతామన్న ప్రభుత్వం సుమారు 1.50000కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. బడ్జెటికేటాయింపుల్లో పెంచుతున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం వాటిని ఖర్చుచేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. మూడువిభాగాల ద్వారా దళితులకు కేటాయింపులు చేస్తున్న ప్రభుత్వం సబ్‌ప్లాన్ కింద కేంద్రమే ఒక నోడల్ ఆఫీసర్‌ను అపాయింట్‌చేసి 102శాఖల ద్వారా విడివిడిగా కాకుండా ఒకేచోట పూల్‌చేసి దళితుల ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు అయ్యేవిధంగా ప్రత్యేకకృషి కొనసాగించాలన్నారు. ప్రధానమంత్రి దళితుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రతి మూడునెలలకోసారి ఈబడ్జెట్‌పై సమీక్ష చేయాలన్నారు. అంకెల్లో పెంచడం తప్ప ఆచరణలో ఖర్చు చేయకపోవడం వల్ల దళితులకు ఒరిగేది ఏమి ఉండదు అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ పూలే సేవాసమితి డివిజన్ అధ్యక్షులు ఎస్.నర్సింలు, యువజనసంఘం డివిజన్ నాయకులు శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నిరసన

సిర్గాపూర్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న బిఆర్ఎస్ నేతలు

సిర్గాపూర్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రాజకీయ కక్షసాధింపులో భాగంగా సిట్ నోటీజులు జారీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ నేతలు ఆదివారం మండలకేంద్రమైన సిర్గాపూర్‌లో నిరసన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచనల మేరకు బిఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో నిరసన తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని నాయకులు జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు నర్సింలు, రాజుగౌడ్, నాయకులు గఫూర్, వాషింగ్, నర్సాగౌడ్, నాగిశెట్టి పటేల్, మైను, జబ్బార్, బలరాం, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే నోటీసులిస్తారా-మండల బిఆర్ఎస్ అధ్యక్షులు...
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ప్రశ్నించిన బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌రావు పాటిల్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

సిట్ నోటీసులపై భగ్గుమన్న బిఆర్ఎస్

ఝరాసంగంలో నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

ఝరాసంగం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రాజకీయ కక్షలతో సిట్ నోటీసులు ఇవ్వడంపై బిఆర్ఎస్‌నేతలు భగ్గుమన్నారు. ఆదివారం మండలకేంద్రమైన ఝరాసంగంలో బిఆర్ఎస్‌నేతలు నిరసన వ్యక్తంచేస్తూ ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశం, ఆయాగ్రామాల సర్పంచులు వినోదబాలరాజ్, మాజీ సర్పంచు బొగ్గుల జగదీశ్వర్, మాజీ ఎంపిపి అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, కేతకి ఆలయ మాజీ కమిటీ ధర్మకర్తలు నగేష్ సజ్జనార్, నాగేశ్వర్, ఎంపి మాణిక్యం, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

చౌటకూరు. ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గంజోజిపేట గ్రామ కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి అశోక్ ఆదివారం అంత్యక్రియలకు 5వేల రూపాయలను అందచేశారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు రూ.5వేలు అందచేస్తానని పంచాయతీ ఎన్నికల సందర్భంగా హామీచేశారు. ఎన్నికల్లో చేసిన హామీమేరకు గ్రామానికి చెందిన గొల్ల లింగయ్య కుటుంబానికి 5వేల రూపాయలు అందించినట్లు సర్పంచి నవనీత అశోక్ పేర్కొన్నారు.

ఖలీల్‌పూర్‌లో భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉప్పరి శేఖర్‌సగర

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఖలీల్‌పూర్‌లో జహీరాబాద్-బీదర్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన భగీరథమహర్షి విగ్రహాన్ని సగరసంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్‌సగర, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌరక్క సత్యం, గ్రామ సర్పంచి బి.వెంకటేశం, సంగారెడ్డిజిల్లా అధ్యక్షులు ఆర్.మురళీకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు నర్వ అంజయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశం, జిల్లా కోశాధికారి తుక్కన్న, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు ఎం.రాజు, జిల్లా యువజన అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా ప్రధానకార్యదర్శి పి.జనార్ధన్, గ్రామ అధ్యక్షులు విజయ్‌కుమార్, గ్రామ ప్రధానకార్యదర్శి అశోక్, గ్రామకోశాధికారి నర్సింలు తదితర సగరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు బి-ఫాంల పంపిణీ

బి-ఫాం అందచేస్తున్న పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్

జహీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
జహీరాబాద్ మున్సిపాలిటీకి ఈ నెల 11న జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులకు పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, డిసిసి అధ్యక్షులు తూర్పు నిర్మల జగ్గారెడ్డిలు సోమవారం పంపిణీచేశారు. హైద్రాబాద్‌లో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మాజీమంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డిలకు మున్సిపలకు సంబంధించిన 37 అభ్యర్థుల బి-ఫాంలను అందచేయగా మంగళవారం పోటీచేసే అభ్యర్థులకు నాయకులు బి-ఫాంలను అందచేయనున్నట్లు తెలుస్తోంది.

గిరిజనులు వ్యాపారరంగంలో రాణించాలి

-బొమ్మారెడ్డిగూడెం సర్పంచి జైపాల్‌నాయక్

చౌటకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
గిరిజనులు వ్యాపారరంగంలో రాణించి ఆర్థికంగా స్థిరపడాల్సిన అవసరం ఉందని మండలంలోని బొమ్మారెడ్డిగూడెం సర్పంచి జైపాల్‌నాయక్ అన్నారు. గిరిజనతండాకుచెందిన యువకుడు స్వయం ఉపాధి నిమిత్తం టెంట్ హౌజ్‌ను, డెకరేషన్, సౌండ్, ఎకె ఫోటోగ్రఫీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకోగా సర్పంచి దుకాణాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ హట్యా రాములు, వార్డుసభ్యులు గోపాల్, సుభాష్, రవీందర్‌నాయక్, మాజీ ఎంపిటిసిసభ్యులు సుదర్శన్, శంకర్‌నాయక్, మారుతి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

-విజేత శివంపేట జట్టుకు 10వేలు, ట్రోఫీ

-పుల్‌కల్ ఎస్ఐ ఎస్ఐ విజ్వజేన్



సిఎం కప్ విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎస్ఐ విశ్వజేన్

పుల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల పరిధిలోని పెద్దారెడ్డి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజయ్య ఆధ్వర్యంలో కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 37 టీంలు 10 రోజుల పాటు సాగిన క్రీడల్లో తలపడ్డాయి. క్రీడలు ప్రశాంతంగా ముగిసేలా చూసిన ఎస్ఐ విశ్వజేన్‌కు టీం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఫైనల్‌లో జరిగిన హోరాహోరీ పోరులో రెసిడెన్షియల్ జట్టుపై శివంపేట్ జట్టు పైచేయిగా నిలిచి టోర్నీకప్పును కైవసం చేసుకుంది. ఈసందర్భంగా ఎస్ఐ విశ్వజేన్ మాట్లాడుతూ క్రీడలతో శరీరం దారుఢ్యంగా మారడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. టోర్నీ విజేతగా నిలిచిన జట్టుకు గాండ్ల సతీష్ సహకారంతో 10వేల రూపాయల నగదుతోపాటు టోర్నీ కప్పును ఎస్ఐ విశ్వజేన్ అందచేశారు. క్రికెట్ టోర్నమెంట్ ముగింపును పురస్కరించుకుని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన రమేష్‌పాటిల్ అన్నదాన వితరణ చేశారు.

5న హైద్రాబాద్‌లో కబడ్డీ టోర్నమెంట్...
తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, ఇన్సూరెన్స్, పింఛన్‌లాంటి సౌకర్యాలు కల్పించేందుకు ఈనెల 5వతారీఖున హైద్రాబాద్‌లో కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు మన్నె ఫౌండేషన్ అధినేత ప్రణయ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అంజయ్య, సింగూర్, ముదిమాణిక్యం, రాయపాడు గ్రామాల సర్పంచులు శ్రీనివాస్, రమేష్, లక్ష్మిరాజు, కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, బిజెపి మండలనాయకులు రమేష్‌పటేల్, సిడిఆర్ యువసేన అధ్యక్షులు గాండ్ల విక్రం, సతీష్‌కుమార్, యువజన నాయకులు ప్రేమ్‌కుమార్, టోర్నీకి ఎంపైర్‌గా వ్యవహరించిన పోచారం మహేష్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీచేసిన ఎడిఎ

కంది, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలంలోని ఆయాగ్రామాల్లోని ఎరువుల దుకాణాన్ని ఎడిఎ వెంకటలక్ష్మి సోమవారం తనిఖీచేశారు. దుకాణంలోని రికార్డులను ఎడిఎ పరిశీలించారు. ఈసందర్భంగా ఎడిఎ వెంకటలక్ష్మి మాట్లాడుతూ రైతులు యూరియా కొనుగోలు చేసేందుకు విధిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారా బుక్‌చేసుకుని ఎరువులను కొనుగోలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిఎంకప్ విజేతలకు బహుమతులు

సిఎంకప్ విజేతలకు బహుమతులు అందచేస్తున్న అధికారులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో యువత కేరింతలమధ్య సాగిన మండలస్థాయి సిఎంకప్ క్రీడలు సోమవారంతో ముగిసాయి. ప్రతిభచాటిన క్రీడాకారులకు ఎంపిడిఓ షాగుప్తా ఇఫ్రాత్, తహసీల్దార్ ప్రభులు, మండల విద్యాధికారి మారుతి రాథోడ్, ఉపాధ్యాయులు బహుమతులు అందచేసి అభినందించారు.

ఉపాధిపనులను సద్వినియోగం చేసుకోవాలి

-కరస్‌గుత్తిలో ఉపాధి పనులను ప్రారంభించిన సర్పంచి



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచి, ఎపిఓల దృశ్యం

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల పరిధిలోని కరస్‌గుత్తిలో సోమవారం ఉపాధిహామీ పనులను ఎపిఓ మురళీకృష్ణతోకలిసి గ్రామసర్పంచి కవితనారాయణజాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచి, ఉపాధి ఎపిఓలు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు ఎపిఓ సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి అంబ్రిష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్‌పాటిల్, నాయకులు సోపన్‌పటేల్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

తెలంగాణకు మేలుచేసే బడ్జెట్

-ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
పార్లమెంట్‌లో ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి మేలుచేసేలా ఉందని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురంలోని తననివాసంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలకు, మౌలికవసతులకు బడ్జెట్ పెద్దపీట వేసిందన్నారు. హైద్రాబాద్‌కు 3 హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించడం గర్వంగా ఉందని రాష్ట్రం జాతీయ వృద్ధియంత్రంగా మరింతగా బలపడనుందని సంతోషం వ్యక్తంచేశారు. భారతదేశం సుమారుగా 7శాతం వృద్ధిరేటుతో ముందుకు సాగడం తథ్యమన్నారు. ప్రజలసంక్షేమం, రైతులసౌభాగ్యం, మహిళల సాధికారత, యువత ఆశయాలసాధనకు అన్నిరంగాల అభివృద్ధి, సంక్షేమానికి అనుగుణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు.

టీ బేస్ క్యాలెండర్ ఆవిష్కరణ

-క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిఎస్‌పి, కమిషనర్

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి, మున్సిపల్ కమిషనర్, సిఐ

జహీరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవాసమితి రూపొందించిన టీ బేస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను పట్టణంలోని పచ్చతోరణం హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిఎస్‌పి సైదానాయక్, సిఐ శివలింగం, మున్సిపల్ కమిషనర్ జైత్రామ్‌నాయక్, టీ బేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసీరామ్‌రాథోడ్, సంగారెడ్డిజిల్లా ప్రధానకార్యదర్శి అర్జున్‌చౌహాన్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ శేషు, సివిల్ కాంట్రాక్టర్ సంజురాథోడ్, కోహీర్ ఎస్ఐ నరేష్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిబేస్ జహీరాబాద్‌డివిజన్ అధ్యక్షులు రమేశ్‌బానోత్, ప్రధాన కార్యదర్శి జైసింగ్‌చౌహాన్, గౌరవ అధ్యక్షులు దేవిసింగ్‌రాథోడ్, కోశాధికారి ధన్‌రాజ్, అసోసియేట్ అధ్యక్షులు నర్సింగ్‌పవార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హీరాలాల్‌చౌహాన్, రాష్ట్రకార్యదర్శి సుభాష్‌రాథోడ్, జైరాం, కిషన్ పవార్, భంగిరాథోడ్, హీరాలాల్‌పవార్, సురేష్, గోపాల్‌రాథోడ్ పోలీస్, రవినాథ్, శంకర్, వేణుకుమార్, కిషన్‌బానోత్, సికిందర్, విజయ్‌కుమార్, మదన్‌రాథోడ్, కిషన్‌చౌహాన్, సతీష్‌రాథోడ్, ధర్మ, అశోక్, పాండుపవార్, బ్రహ్మానంద్, జగదీశ్వర్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

జంతు సంక్షేమంపై ర్యాలీ..

ర్యాలీలో పాల్గొన్న అధికారులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన చిలిపిచెడ్‌లో సోమవారం జంతుసంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య, మండల పశువైద్యాధికారి వినోద్‌కుమార్, సర్పంచి రాములు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పశుసంక్షేమం, వాటిపట్ల మన బాధ్యత అనే అంశంపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మండల పశువర్ధక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ శ్రీనివాస్

వెల్దుర్తి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాధికారి సీతారాం, ఉపాధ్యాయులు వెంకటస్వామి. నరసింహారెడ్డి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.